



వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలలో చిత్తూరు జిల్లా నిర్మాణ, కార్యకలాపాల, నివేదిక ప్రవేశపెడుతున్న జిల్లా బాధ్యులు ఓబులరాజు

ముసురు వాన

- జిల్లాలో తుపాను ప్రభావం
- చలిగాలుల తీవ్రం

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి:

చిత్తూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా మోస్తారు నుంచి భారీ వర్షాలు నమోదు అవుతున్నాయి ఈ జిల్లాలో నగరి మండలంలో అత్యధికంగా వర్షపాతం నమోదయింది. ఇక్కడ 36.8 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లావ్యాప్తంగా 11 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదయింది. కాగా రామకుప్పం కుప్పం మండలాల్లో వర్షం పడలేదు. జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న 169 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు.

ఇందులో నగరి రూరల్ లో 59 మంది అర్బన్ లో 50 మంది పాల సముద్రం మండలంలో 50 మంది, విజయపురం మండలంలో పదిమందిని వీటిల్లో ఉంచారు వీరందరికీ కావలసిన ఆహారం నీరు వంటి సదుపాయాలను సమకూర్చారు. ఉదయం నుంచి పడుతున్న వర్షాలకు ఈ జిల్లాలో చెరువుల్లో నీరు విస్తారంగా చేరుతోంది అలాగే లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పంట పొలాల్లో నీరు చేరడంతో రబీ సీజన్లో విత్తనాలు వేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు పంట నష్టపోయే ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన చెందుతున్నారు.

మాండూస్ తుపాను ప్రభావం వల్ల జిల్లా అంతట ముసురు వాన కమ్ముకుంటోంది. శుక్రవారం ఉదయం నుంచి చలిగాలులు వీచాయి. రేపు ఎల్లుండి కూడా తుపాను ప్రభావం ఉండడంతో జిల్లా వ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించారు. ఇందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నంపాఠశాలలు, కళాశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.

అధికారులకు కలెక్టర్ సూచనలు...

తుపాను సహాయక చర్యల కొరకు 24/7 కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉండాలి. తుపాను తీవ్రత ఈనెల 11వ తేది వరకు ఉందని, విపత్తునుసమర్థవంతంగా ఎదుర్కొనేలా జిల్లా స్థాయి నుంచి మండలస్థాయి వరకు గల అధికారులు ప్రధాన కార్యస్థానంలో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రాణనష్టం సంభవించకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు మండలస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను చేపట్టాలని, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని తెలిపారు. జలాశయాలు, చెరువులు, కుంటలు, వాగులు వద్ద ఇరిగేషన్ అధికారులు నీటినిల్వ సామర్థ్యంనకు సంబంధించి నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈదురు గాలులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున గుడిసెలలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అలాగే కేంద్రాలలోఅవసరమైన తాగునీరు, భోజన వసతులు వంటి కనీస వసతులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు కంట్రోల్ రూమ్‌కు అందే సమస్యలపై వెంటనే స్పందించాలని ట్రాన్స్కో అధికారులను, సురక్షిత తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పబ్లిక్ హెల్త్‌వర్కర్‌లతో సమన్వయం చేసుకోవాలని మునిసిపల్ కమీషనర్లు, డిపిఒ, డివిజినల్ పంచాయతీ అధికారులు ఆదేశించారు. తుపాను సహాయక చర్యలనిమిత్తం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములు నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. పశునష్టం జరగకుండా వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండండి

నీవానదిలో వేగంగా వరద నియంత్రణ చర్యలు

చిత్తూరుఅర్బన్: మాండూస్ తుపాన్ నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అన్ని సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు తుపాను ముందస్తు సన్నద్ధత ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగం అధికారులు అధిక వర్షాల వల్ల కలిగే ఇబ్బందులు, వరద తదితర విపత్తులను ఎదుర్కొనేందుకు అన్నిరకాలుగా సిద్ధమయ్యారు. ఇదే సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను స్థానిక వార్డు సచివాలయం కార్యదర్శులు అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షితప్రాంతాల్లో ఉండాలని, దెబ్బతిన్న, శిథిలావస్థలోని గహాల్లో ఉండవద్దని హెచ్చరించారు. నీవానది పరివాహక ప్రాంతాల్లోని నివాసాలకు వెళ్లి నదిలో నీటిమట్టం పెరిగితే సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని కోరారు. మరోవైపు నీవానదిలో వరదలు నియంత్రించడం కోసం పూడికమట్టి భారీగా తొలగించే కార్యక్రమం కొనసాగుతోంది. జేసీబీల సహాయంతో నదిలో వ్యర్థాలను, పొదలను తొలగిస్తున్నారు. తుపాను విపత్తును ఎదుర్కోవడానికి నగరపాలక అధికార యంత్రాంగం సన్నద్ధమైంది.



లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

గంగినేని చెరువు శుభ్రతకు చర్యలు చేపట్టండి

జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్



చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పరిధిలోని గంగినేనిచెరువు పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ యం.హరినారాయణన్ ఇరిగేషన్, నగరపాలక అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ గంగినేని చెరువును పరిశీలించారు. ప్రధానంగా గంగినేని చెరువు ఆక్రమణలకు గురికాకుండా పక్కాగా సర్వే నిర్వహించి కంచె ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నీటితోపాటు వచ్చే వ్యర్థాలు చెరువులోకి చేరకుండా మెస్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువు పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. ఇరిగేషన్ ఎస్ ఈ విజయ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ హీరా నాయక్, నగర పాలక ఎంఈ ధనలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు. అలాగే కార్వేటి నగరం కృష్ణాపురం రిజర్వాయర్‌ను జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. రాబోయే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి నష్టం కలుగకుండా చూడాలని కార్వేటినగరం మండలం లోని కష్ణాపురం రిజర్వాయర్ లో నీటి మట్టం నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని.. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి నీటిని విడుదల చేయడం జరగాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు జేసీ సూచించారు.

మాండూస్‌తో స్తంభించిన జనజీవనం

సోమల: తుపాను ప్రభావం కారణంగా మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా మండలస్థాయి అధికారులు కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ వారికి కేటాయించిన పంచాయతీలలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులను పరిశీలించారు. తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో నాగరాజు, ఈవోపీఆర్డీ గఫూర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈఈ ఝాన్సీ, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, హౌసింగ్ సిబ్బంది కలసి నంజంపేట, పొదలకుంటపల్లి, ఆవులపల్లి, అన్నెమ్మ గారి పల్లి ప్రాంతాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను ముందస్తుగా నంజంపేట ఉన్నత పాఠశాల వద్దకు చేర్చి వారికి పునరావాసం కల్పించారు. సర్పంచ్ వెంకటరెడ్డి అధికారులతో మాట్లాడి పునరావాస కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అన్నెమ్మ గారి పల్లి, పెద్ద ఉప్పరపల్లి ప్రాంతాలలో కార్యదర్శులు మసూద్ బేగం, లలిత కుమారి, ఏపీవో దినకర బాబు పర్యటించి ప్రమాదకరంగా ఉన్న చెరువు కట్టలను పరిశీలించారు. కందూరు, నెల్లిమంద ప్రాంతాలలో మధ్యాహ్న ఒంటిగంట నుండి భారీ వర్షం కురిశాయి. జనజీవనం వర్షం స్తంభించిపోయింది. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రమణారెడ్డి, గణపతి, మెకానిక్ బాషా, బాలసుబ్రమణ్యంపాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మాండూస్ తుపాను వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్ పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు వద్ద ఉన్న నీవానది బ్రిడ్జి, హైస్కూల్లో తుపాన్ రిలీఫ్ కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మండల అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో , తహసీల్దార్ ఇన్బనాథన్, ఈవోపీఆర్డీ శివయ్య, పంచాయతీ కార్యదర్శి అంజాద్‌బాషా పాల్గొన్నారు.



కృష్ణాపురం రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

12న డిపార్ట్‌మెంటు పరీక్షలు



పరీక్షపై అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈ నెల 12వ తేదీన చిత్తూరు జిల్లా కేంద్రంలో డిపార్ట్ మెంటు పరీక్ష జరుగుతుందని.. అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ అన్నారు. ఈనెల 12వ తేదీన చిత్తూరు జిల్లాలోని అర్ వి ఎస్, సీటంస్ కళాశాలలో జరుగుతుందన్నారు. మొత్తం 370 మంది పాల్గొంటారని.. అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షలకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పరీక్షకు గంటన్నర ముందుగానే పరీక్షకు అనుమతించాలన్నారు. పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఉంచాలని.. చుట్టుపక్కల జిరాక్స్ కేంద్రాలు లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఇతర వస్తువులు అనుమతించరన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వోతోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

180 పనులకు అంచనాలు పంపాలి

సచివాలయం నిర్మాణ పనులు పూర్తి కాగానే అప్‌లోడ్ చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని మంజూరు చేసిన పనులను వేగవంతం చేయాలని, ఇంకా అంచనాలు పంపనీ వాటికి శనివారం సాయంత్రంలోగా పంపాలని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 1,553 పనులను అప్‌లోడ్ చేయగా 1,504 మంజూరు చేయడం జరిగిందని కొన్ని పనులకు సంభందించి తిరిగి పంపడం జరిగిందన్నారు. బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలని, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పనులకు కావాల్సిన సిమెంట్‌కు బిల్లులు చెల్లించి కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి తప్పించుకోవాలని, జరుగుతున్న పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధశాఖల ద్వారా జరుగుతున్న పనుల వివరాలు అడిగి వేగవంతం చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తిచేయండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నిర్ణయించుకున్న మేరకు ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారయాణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంగా నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు భవన నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. లక్ష్యాలను నిర్ణయించుకున్న అధికారులు తప్పనిసరిగా లక్ష్యాలను చేరుకొని పూర్తి చేసినట్లయితే ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను సకాలంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లవుతుందన్నారు.

ఈ-మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-పలమనేరు: పట్టుగూళ్ల ఈ-మార్కెటింగ్‌పై మల్బరీ సాగుచేసే రైతులకు అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ యం. హరినారాయణన్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వర్షాన్ని సైతం లెక్కచేయక అభివద్ధి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. పలమనేరు పట్టుగూళ్ల విక్రయ కేంద్రాన్ని పరిశీలించి పట్టు రైతులతో మాట్లాడారు. ఈ-మార్కెటింగ్ విధానం సంబంధించి పూర్తి వివరాలను పట్టుపరిశ్రమ అధికారి శోభారాణి కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ వెంట పలమ నేరు ఏడీ కిషోర్ నాయక్, నగేష్, రవి నాయక్, నాన్‌ఫార్మ్ సెక్టార్ ఇన్‌ఛార్జి రవినాయక్, మార్కెట్ ఆఫీసర్ కిశోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గంగవరం మండలం జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో రూ.62 లక్షలతో నాడు- నేడు రెండో విడతలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులను వేగంగా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు.. మధ్యాహ్న భోజనం పరిశీలించిన మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. గంగవరం మండలంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన కలెక్టర్ ఈ యూనిట్‌ని రైతులకు ఉపయోగకరంగా అందుబాటులోకి తీసుకురావాలని, జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి కి సూచించారు. పలమనేరు

వికసించని బాలికా వికాసం..!

నిధుల్లేక నీరసించిన వైఎస్ఆర్ కిశోర వికాసం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

బాలికా వికాసం పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఆరోగ్యం స్త్రీపురుషుల సమానత్వం, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, పరిసరాల పరిశుభ్రత, గృహహింస, పిల్లలపై వివక్షత అనే విషయాలపై పాఠశాలలు, కళాశాలలు, పాలటెక్నికల్, ఐటీఐలో చదువుతున్న విద్యార్థినులకు అవగాహన కల్పించేలా వైఎస్ఆర్ కిశోర వికాసం పేరుతో ప్రభుత్వం కేవలం బాలికా వికాసం కోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొదట విడత జిల్లా కేంద్రమైన చిత్తూరులోని కాణిపాకం రోడ్డు సంతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి విడతలో పాఠశాల విద్యార్థినులకు పరిమితం చేశారు. రెండో విడతలో కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 80వేల మంది విద్యార్థినులకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. పీజి, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంపిక చేసిన చురుకైన విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అయితే ప్రస్తుతం వైఎస్ఆర్ బాలికా వికాసం కార్యక్రమం నిధులు లేక నీరసించిపోయింది. కరోనా కారణంగా ఆగిపోయినట్లు అధికారులు చెబుతున్నా.. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా జిల్లాలో ఎక్కడా వైఎస్ఆర్ కిశోర బాలికా వికాసం పేరుతో కౌమార బాలికలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు జరగడం లేదు. ప్రయోజనాలు వైఎస్ఆర్ కిశోర బాలికా వికాసం ఈ కార్యక్రమంతో ప్రయోజనాలు అనేకం. కౌమారదశలో ఉన్న పాఠశాల, కళాశాల విద్యార్థినుల్లో సమాజంపై అవగాహన, విషయ పరిజ్ఞానం, ఇతరులపై ఆధార పడకుండా స్వయం ఉపాధి, మహిళా చట్టాలపై అవగాహన వంటి విషయాలను తెలుసుకొనే అవకాశం ఉంటుంది. ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంచుకునేందుకు దోహదపడుతుంది. ఇతరులతో మాట్లాడేందుకు సహజంగా ఉండే భయం పోయి స్వేచ్ఛగా మాట్లాడే తత్వం పెంపొందుతుంది.

ఆగిపోయిన నిధులు..

- నాగశైలజ, ఇన్‌ఛార్జి పీడీ, స్త్రీ శిశు సంక్షేమశాఖ

పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులలో సమాజంపై అవగాహన కల్పిండంతో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే వైఎస్ఆర్ కిశోర బాలికా వికాసం మూడో దశ 2019-20 నుంచి నిధుల లేక ఆగిపోయింది. కరోనా ప్రభావం ఓ కారణమైతే ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం మరోకారణం. ప్రభుత్వం నిధులు మంజురు చేస్తే కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాం.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పూతలపట్టు మండలంలో ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో మృతి చెందిన మృతుల కుటుంబాలకు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు ప్రభుత్వం అందించిన రూ.5 లక్షల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో మృతి చెందిన మహిళా కుటుంబ సభ్యులకు చిత్తూరు ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించగా పూతలపట్టు పరిధిలో మృతులకు ఎంఎల్‌ఏ ఎంఎస్.బాబు మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం రూ.5లక్షలు, క్షతగాత్రులకు రూ.లక్ష, వ్యక్తిగతంగా సొంత నిధుల ద్వారా రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. చిత్తూరు వైకాపా కార్యాలయంలో ఆర్థిక సాయం అందించే కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఛైర్మన్ రామ్‌గణేష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు. పూతలపట్టు వైసీపీ కార్యాలయంలో పూతలపట్టు శాసనసభ్యులు, చిత్తూరు ఆర్డీవో రేణుక అందించారు. కార్యక్రమంలో తవణంపల్లె వైస్ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, ఐరాల మండలం వైసీపీ కన్వీనర్ బుజ్జిరెడ్డి, తవణంపల్లె వైసీపీ కన్వీనర్ హరిరెడ్డి, నాయకులు హరికష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మృతుల కుంటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

మల్బరీ సాగుపై అవగాహన పెంచండి



పట్టుపురుగుల సాగును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలో ప్రస్తుతం ఉన్న మల్బరీసాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులకు ఈ సాగుపై మరింత అవగాహన పెంచాలని జిల్లాకలెక్టర్ యం.హరినారాయణన్ జిల్లా సిరికల్చర్ అధికారి శోభరాణికి సూచించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చిత్తూరు రూరల్ మండలం పి.కొత్తూరులో హేమంత్‌రెడ్డి నిర్వహిస్తున్న చాకీ కేంద్రాన్ని పరిశీలించి మల్బరీ సాగులో ప్రధానమైన పట్టు పురుగుల పెంపక మొదటిదశ, రెండోదశలో పట్టుపురుగుల పెంపకానికి తీసుకోవలసిన జాగ్రత్తలు వాటి నిర్వహణకు అవసరమైన పరిస్థితులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, చాకి కేంద్రం నిర్వహణ తదితర అంశాలపై జిల్లా సిరికల్చర్ అధికారి కలెక్టర్‌కు వివరించారు.

డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం...

తెలుగు యువత అధ్యక్షులు కాజూరు రాజేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా విచ్చలవిడిగా చెలరేగిపోతోందని తెలుగుయువత అధ్యక్షులు కాజూరు రాజేష్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఆంధ్రప్రదేశ్‌లో బియ్యం ఎగుమతుల్లో అన్నపూర్ణగా పేరుపొందితే నేడు రాష్ట్రం జగన్‌పాలనలో నిత్యం డ్రగ్స్‌కి గంజాయికి నిలయంగా మారిపోయిదన్నారు. అన్ని రాష్ట్రాల కంటే అత్యధికంగా ఆంధ్ర రాష్ట్రంలోనే డ్రగ్స్‌దందాలో అత్యధికంగా పట్టుబడుతున్నారని 18వేలకేజీలను గంజాయి స్వాధీనం చేసుకోవడం చూసే ఆంధ్ర, ఒరిస్సా ఈరెండు రాష్ట్రంలోనే అత్యధికంగా గంజాయి అక్రమ కేసులు వెలుగు చూస్తున్నట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వమే బాధ్యత వహించి డ్రగ్స్ మాఫియాని అరికట్టాడి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృత్తం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి వరుణ్, నగర ఉపాధ్యక్షుడు హేమరాజు, నగర ఆర్గనైజర్ సెక్రెటరీలు రాంప్రసాద్,కుమార్, గౌస్, యువత నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తెలుగుయువత నాయకులు

పోలీసుశాఖలోని ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉద్యోగాలకు జారీ చేసిన నోటిఫికేషన్ నాలుగు సంవత్సరాలుగా ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్రనిరాశను కలిగించిందని, వెంటనే భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు శుక్రవారం ఒక ప్రటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే పోలీసుశాఖలో ఏడాదికి 6700 పోస్టులు చొప్పున భర్తీచేస్తామని వాగ్దానం చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. కానీ నాలుగు సంవత్సరాలుగా నోటిఫికేషన్లు వెలువడలేదు. దీనికోసం సన్నద్ధమైన వేలాది మంది అభ్యర్థులకు వయో పరిమితి నిబంధన ఇబ్బందిగా మారింది. నోటిఫికేషన్‌లో జాప్యం వల్ల నిరుద్యోగులకు నష్టం జరుగకుండా నివారించాలి. అందువలన అభ్యర్థుల వయోపరిమితి 35సంవత్సరాలకు పెంచాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదన్నారు. పోలీసుశాఖలో సుమారు 35శాతం పోస్టులు ఖాళీలు ఉన్నట్లు చెబుతున్నారు. వీక్లీ ఆఫ్ విధానం వల్ల 10వేల మంది సిబ్బంది అదనంగా అవసరమవుతారు. కానీ ప్రభుత్వం కేవలం 6100కానిస్టేబుల్, 411 ఎస్సై పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చింది. ఒక్క లా అండ్ ఆర్డర్‌లోనే కాకుండా ఫైర్, జైలు వార్డెన్ తదితర పోస్టులను కూడా భర్తీచేస్తే ఎక్కువ మంది సిబ్బంది అవసరమవుతారు. కనుక నాలుగేళ్ళుగా ఉద్యోగం కోసం ఎదురు చూస్తూ శిక్షణ తీసుకుంటున్న యువతకు న్యాయం చేసేవిధంగా పోలీసు శాఖలోనున్న ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల వేగవంతం: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంటింటికీ నీరు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన మేరకు పనులను వేగవంతం చేయాలని, సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను నిర్ణయించిన సమయంలో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి జెసి ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పనుల పురోగతిపై రివ్యూ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంకా ప్రారంభించనీ పనులను అన్నింటినీ ప్రారంభించాలని వేగవంతం చేయాలన్నారు. 5లక్షల రూపాయల లోపు పనులను పూర్తి చేయడం సకాలంలో చేయాలన్నారు. ఆ పై పనులను ఇంకా ప్రారంభించనీ వాటిని వెంటనే ప్రారంభించాలని అన్నారు. నిర్ణయించుకున్న మేరకు పనులను వారంవారం పురోగతిని సమీక్షించాలని ఆర్డబ్ల్యూఎస్ఎస్ఈ నాగజ్యోతినీ ఆదేశించారు. శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 488 పనులు మంజూరు కాగా 480 పనులు జరుగుతున్నాయని ప్రారంభించనీ పనులను ప్రారంభించి,మిగతా పనులను వేగవంతం చేయాలని అన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ప్రజాశక్తి-కార్వేటినగరం: మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకష్ణశాస్త్రి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు మద్యం దుకాణాలను చిత్తూరు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్, అలాగే డిపో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యన మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పొరబాట్లు చేస్తే కేసులు నమోదు చేస్తామని, చదువుకున్న వారిని భవిష్యత్తులో చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అతిక్రమించకుండా ఉండాలని ఆదేశించారు. ప్రతి దుకాణంలోనూ స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని సూచించారు. రికార్డులను, స్టాకును పరిశీలించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ కుమార్, జాన్సన్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు ఉచిత వైద్యసేవలు



ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజా, జూనియర్ డాక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వచ్చిన గర్భిణులకు రక్తపోటు, షుగర్ పరీక్షలు, బరువు, గుండె పరీక్షలు చేశారు. సురక్షితమైన ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేసుకోవాలన్నారు. ఆసుపత్రిలో కాన్పులు చేసుకోవడంతో ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, పార్వతమ్మ, పంకజాక్షి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు.. కూలీలకు వరం



ప్రజాశక్తి-పులిచెర్ల: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల పాలిట ఓ వరమని ఏపీడీ శ్రీనివాసులు, సర్పంచులు ఉషారాణి, లక్ష్మీ, రాణెమ్మ, మధు, వాసుదేవరెడ్డి, ప్రతాప్ రెడ్డి, స్వాతిబాల, అమ్ములు తెలిపారు. పులిచెర్ల మండలం చల్లావారిపల్లి, దేవలంపేట, వెంకటదాసరపల్లి, 102 ఈ రామిరెడ్డిగారిపల్లి, పులిచెర్ల, మంగలంపేట, నన్నూరివారిపల్లి, మతుకువారిపల్లి పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరం లో చేపట్టాల్సిన పనుల గుర్తింపుపై గ్రామసభలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏపీవో షౌకత్ అలీ మాట్లాడుతూ ఏడాదిలో చేపట్టాల్సిన పనులపై గ్రామసభలు ఏర్పాటుచేసి లేబర్ బడ్జెట్ తయారు చేయాలన్నారు. ఉపాధి పథకంలో చేపట్టే అన్ని పనులను గ్రామసభల ఆమోదం తప్పనిసరి అన్నారు. పథకం నిబంధనల మేరకు పనులను గుర్తించి పని కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధి పథకం కూలీలకు వరంలాంటిదని తెలిపారు. ఏపీవో షౌకత్ అలీ, జేఈ, టీఎలు, ఎఫ్ఏలు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహతి ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం గర్భిణులకు వైద్యసేవలు అందించారు. ఆరోగ్య విద్యాధికారి సావిత్రి మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు, తల్లిపాలు, నవజాత శిశు సంరక్షణ, కుటుంబ నియంత్రణపై వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు, డాక్టర్ విజయచంద్ర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కావేటిగారిపల్లి విద్యార్థులు



ప్రజాశక్తి-పులిచెర్ల: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు కావేటిగారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజువాణి తెలిపారు. కావేటిగారిపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం మంజువాణి మాట్లాడుతూ తిరుపతి జిల్లా చంద్రగిరి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 ఏళ్లలోపు బాల బాలికలు హాకీ పోటీల్లో పాల్గొన్నారన్నారు. విద్యార్థులు సంతోష్, హిమశ్రీ, వంశీకా రెడ్డి పాల్గొని ప్రతిభ కనబరిచారని, జనవరి నెలలో పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి హాకీ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయి హాకీ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు మంజువాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో విజయం సాధించి జాతీయ హాకీ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

13న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13వ తేదీన మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ అనిత అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

విపత్తును ఎదుర్కోవడానికి అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి-కార్వేటినగరం: మాండూస్ ప్రభావంతో జరిగే విపత్తును ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించి కుశస్థలి నదిపై ఉన్న కష్ణాపురం జలాశయం, ఆర్కేవీవీ పేట సమీపంలో ఉన్న తుమ్మల చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సమాచారం మేరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. క్షేత్రస్థాయి నుంచి అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రజలు ఇళ్ల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రాకుండా చూడాలన్నారు. రానున్న రెండు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు రానున్నాయని.. వంకలు.. వాగుల వైపు ప్రజలు రాకుండా చూడాలని చెరువుల వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు వీలైనంత వరకు బయటకు రాకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు వారి వారి కేంద్రాల్లో ఉండాలని సూచించారు. అలాగే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కష్ణాపురం జలాశయం నిండే అవకాశం ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నీటి పెరుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి గేట్లు ఎత్తే ముందు నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ లతాబాలాజీ, మండల తహసీల్దార్ అమర్నాథ్, ఎంపీడీవో మోహనమురళీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, సర్పంచ్ ధనశేఖర్ వర్మ, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: మాండూస్ తుపాను కారణంగా యాదమరి మండలం భూమిరెడ్డిపల్లి సమీపంలోని నుంజర్ల ప్రాజెక్టును శుక్రవారం చిత్తూరు ఆర్డీవో రేణుక పరిశీలించారు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం 15.65 మిలియన్ క్యూబిక్ అడుగులు ఉన్నట్లు అంచనా వేశారు. ప్రాజెక్టులు నీటి సామర్థ్యం పూర్తిస్థాయిలో ఉండటంతో ఇరిగేషన్ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతంలోని యాదమరి రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే మండల పరిధిలోని నీరు నిల్వ ఉన్న అన్ని చెరువులను ఇరిగేషన్ అధికారులు పరిశీలించాలన్నారు. చెరువు కింద ఉన్న గ్రామాలను.. వాగులు, వంకలు సమీపంలో ఉన్న గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఆర్డీవోతో పాటు యాదమరి తహసీల్దారు వై చిట్టిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివజ్యోతి, వీఆర్వోలు రూపేష్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాలసముద్రం: మాండూస్ తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలకు ప్రాణనష్టాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు బాబు, ఎంపీడీవో విద్యావతి తెలిపారు. మండల పరిధిలోని సన్నగుంట, ఎస్‌కే ఆర్ పురం ఎస్సీకాలనీలో వారు పర్యటించి వర్షాలకు ఇళ్లు లేకుండా పూరిగుడిసెలో ఉన్న ఎస్టీలను 40 మందిని పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తరలించారు. వారికి రెండు రోజులపాటు భోజన వసతి ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రజలు బయట తిరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి చిత్తూరు లక్ష్మి శ్రీకావ్యరాజపురం, పాలసముద్రం సచివాలయాల్లో వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తుపాన్ ప్రభావంతో వచ్చే అనర్థాలను పూర్తిగా వివరించారు. వర్షాలు తగ్గేంతవరకు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి నరేష్, రాజీవ్‌కుమార్, జయశంకర్, కంప్యూటర్ ఆపరేటర్ నాగభూషణం, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గడపగడపకు అభివృద్ధే జగనన్న లక్ష్యం

ప్రజాశక్తి- వి.కోట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి 'గడప గడపకు " అభివద్ధి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని పలమనేరు శాసనసభ్యులు వెంకటేగౌడ తెలిపారు . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఎస్ బండపల్లి పంచాయతీ పరిధిలో ని గ్రామాల్లో వారు పర్యటించారు. ఎమ్మెల్యే ప్రతిగడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రాంతాలకు అతీతంగా చేస్తున్న అభివద్ధి పనులను ప్రజలకు వివరించారు.. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలు సంతప్తికరంగా ఉన్నారని.. దీన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు



అమలు చేయడంలో జిల్లాలోనే పలమనేరు ముందంజలో ఉందని అందుకు సహకరిస్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు నేడు కార్యక్రమం ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రానున్నాయని పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందుబాటులోకి తీసుకురానున్నట్లు వారు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని.. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు .రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి రావడంతో రైతులకు మెరుగైన సేవలు లభిస్తున్నాయని.. రాజకీయాలక తీతంగా అభివద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. అర్హత ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటిని మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీలు తమీం ఖాన్ , లక్ష్మణ్ రెడ్డి తోపాటు నేతలు పీఎన్ నాగరాజు, రఘుపతి నాయుడు, దేవరాజులునాయుడు, సర్పంచులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంరెడ్డి, దామోదరం, వి.కోట, ఉపసర్పంచ్ అక్మల్‌తో పాటు స్థానిక నాయకులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కుంటుబడింది..!

ప్రజాశక్తి-రామకుప్పం: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వ పాలనలో అభివద్ధి కుంటుపడిందని రాష్ట్ర టిడిపి కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ భాష పేర్కొన్నారు. శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ పట్టిందని ప్రజలు అంటున్నారని, ధరల పెంపుతోపాటు రోడ్లు, దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు ఎక్కువయ్యాయని తెలిపారు. అడ్డు చెప్పిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలను వాడుకుంటున్నారని, అప్పులు చేసి సంక్షేమ పథకాలు వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే అందుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసి పండుగలకు నిత్యావసరకులు అందించారని.. రాబోయే రోజుల్లో తమ అధినేతను ఆదరించి మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను



,నిధులు దుర్వినియోగం, ఇసుక మాఫియా, అవినీతి, నిలకడ లేని పాలన తదితర వాటిని ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి, నేతలు గంట్లప్ప గౌడు, రామలింగారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, నియాజ్, విశ్వనాథ్, వెంకటరమణ, వెంకటాచలం, మంజునాథ్, మురళి, జ్ఞాన శేఖర్ రెడ్డి, సురేష్ ,ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం..!

ప్రజాశక్తి-పుంగనూరు: రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన లభించిందని లైన్స్ క్లబ్ అంబాసిడర్, ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ శివ అన్నారు. స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో లయన్స్ క్లబ్ పుంగనూరు నోబుల్ , హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎంసీవీ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్, పుంగనూరు యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ మాట్లాడుతూ రక్తం దానం చేయడంతో మరొకరికి ప్రాణదాత అవుతారన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేస్తే



ఎలాంటి ఇబ్బందులు ఉండదని.. ఎలాంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. సుమారు 35 మంది రక్తదానం చేశారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించడం తగదు

ప్రజాశక్తి-పులిచెర్ల: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం జనసేన నాయకుడు రామచంద్రయాదవ్ కు సరికాదని రాష్ట్ర పాల ఏకరి కార్పోరేషన్ ఛైర్మన్ మురళీధర్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు పాళెంలోని ఆయన నివాసంలో శుక్రవారం మాట్లాడుతూ జనసేన నాయకుడు



రామచంద్ర యాదవ్ తన ఉనికిని చాటుకునేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు చేస్తున్నారన్నారు. జిల్లా అభివద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ ప్రజల సంక్షేమం కోసం కషి చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థానం సంపాదించుకున్నారన్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా ప్రజలను రామచంద్ర యాదవ్ మభ్యపెట్టారన్నారు. బీసీలకు అండగా సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిలుస్తుందని, తన స్వార్థంకోసం బీసీ కులాలను సైతం మోసం చేయడం దుర్మార్గమన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చేస్తున్న విమర్శలు మానుకోవాలని, లేని పక్షంలో నియోజకవర్గంలోని ప్రజలు తిరగనీయరని హెచ్చరించారు.

పునరావాస కేంద్రాలను గుర్తించిన అధికారులు

ప్రజాశక్తి- దొరవారిసత్రం: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మాండూస్ తుఫాన్‌గా మారి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం దొరవారిసత్రం మండలం తహశీల్దార్ గోపిరెడ్డి ఎంపీడీవో సింగయ్య తుఫాన్ మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌లు మండల పరిధిలోని తీర ప్రాంతాలైన కారికాడు, వేలికాడు మీజూరు మొదలగు గ్రామాలను పర్యటించి ఆ గ్రామాలలో ప్రజలు తుపాన్ సమయంలో సురక్షితంగా ఉండే విధంగా చర్యలు చేపడుతూ ఆ గ్రామాలలో పునరావృత కేంద్రాలను గుర్తించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి తుపాన్ గురించి వారికి తెలియజేస్తూ 9వ తేదీ నుండి11వ తేదీ వరకు ఈ తుఫాన్ కొనసాగుతుందని తెలిపారు. గ్రామంలోని యువకులను టాస్క్‌ఫోర్స్ మాదిరిగా ఏర్పాటుచేసి తుపాన్ తీవ్రత పెరిగితే ముందుగా చిన్నపిల్లలను గర్భిణులను, వికలాంగులను వృద్ధులను పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలియజేశారు



అత్యవసర అధికారుల ఫోన్ నెంబర్లను వారికి ఇవ్వడం జరిగింది. గ్రామంలో ఉన్న వాలంటీర్లను వీఆర్ఏలను ప్రతి ఒక్కరు సంసిద్ధంగా ఉండి తుపాన్‌ను ఎదుర్కొనే విధంగా ఉండాలని కోరారు. తుపాన్ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికే అన్ని వసతులు కలిగించే విధంగా చెరువులు చేపడతామని తెలియజేశారు లోతట్టు ప్రాంత ప్రజలు ముందుగానే పునరావృత్త కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. మండల శాఖ అధికారులం దరూ సంసిద్ధంగా ఉండాలని అధికారులు తెలియజేశారు



సర్పంచ్‌పై సర్వేయర్ దాడి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం గొడుగుచింత సర్పంచ్ నక్కా బాబుపై పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయ సర్వేయర్ గురువారం దాడికి పాల్పడ్డాడు. శుక్రవారం తహసీల్దార్ పుల్లారెడ్డి కి సర్పంచ్ ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలో అధిక గాలులు, మెరుపులు వర్షాల కారణంగా విద్యుత్తు తీగలు తెగి, స్తంభాలు విరిగి పడే ప్రమాదం ఉందని ఏఈ రామాంజనేయులు తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని.. ఎక్కడైనా విద్యుత్తు సమస్యలు వస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నేలపై వేలాడుతున్న విద్యుత్ తీగలను, విద్యుత్ పరికరాలను తాకరాదని..తొలగించే ప్రయత్నం చేయరాదని తెలిపారు. ఫోన్‌నంబరు 9440811822 కు వెంటనే సమాచారాన్ని అందించాలని కోరారు.

రేపు అమ్మవారికి ఆలయ కుంభాభిషేకం

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని ఎద్దుల చెరువు కట్టపై వెలసిన ప్రసిద్ధ ఓం శక్తి దేవాలయంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు కుంభాభిషేక మహోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్త వీరాస్వామి తెలిపారు. పూర్వ దేవాలయం స్థానంలో నూతనంగా పునర్ నిర్మాణం చేయబడి నందున మేల్ మరువత్తూరు శక్తి పీఠం స్వాములచే ఈ కుంభాభిషేక కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు అమ్మవారి ఊరేగింపు ఉంటుంద న్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-తొట్టంబేడు : మండలంలోని పెద్ద కన్నలి గ్రామంలో శుక్రవారం రాస్ ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించింది. వైస్ ఎంపీపీ కన్నలి మల్లికమ్మ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాస్ సంస్థ, టాటా ట్రస్ట్ వారి సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉచితంగా వైద్యసేవలను అందించడం మంచి విషయం అన్నారు.

క్రైం న్యూస్

అక్రమ మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పాలమాకులపల్లి సమీపంలో సీఐ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఎస్సై మల్లికార్జున రెడ్డి తన బందంతో అక్రమ మద్యం అమ్ముతున్న ఇద్దరి వ్యక్తులను అదుపులో తీసుకుని విచారించగా కె.వి పురం చెందిన జగదీశ్వర్, రాముల నుంచి మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం అన్యాయం'




ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని షాదీ ఖానా భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు పెద ముస్లిం వివాహాల కోసం షాదీ ఖానా భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ముస్లిం పక్షపాతి అని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ముస్లింలకు సంబంధించిన సంక్షేమ పథకాలన్నీ రద్దు చేశారని, ఇక్కడ శిథిలావస్థకు చేరుకున్న షాదీ మహల్ ను కనీసం మరమ్మతు చేయలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకువెళ్తామని..కచ్చితంగా ముస్లిం మైనార్టీలకు న్యాయం జరిగే విధంగా పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అదిల్, నియాజ్, చాంద్‌బాషా, సలాం సబ్, హనీఫ్, హాఫిజ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు



ప్రజాశక్తి-పిచ్చాటూరు: రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పిచ్చాటూరు మండలంలోని వెంగళత్తూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై శిక్షణ, అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి సంజీవరెడ్డి, రైతు శిక్షణ కేంద్ర వ్యవసాయాధికారులు సరళ, శ్రీనివాసులు, కృషి విజ్ఞాన కేంద్ర అధిపతి డా.ఎస్.శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు దివ్య, రామ్‌కుమార్ పాల్గొని రైతులకు మట్టి పరీక్ష ప్రాముఖ్యత, సమగ్ర పోషక యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, నేల, నీరు సంరక్షణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు భూసార పరీక్షా పత్రాలు అందించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, మండల వ్యసాయాధికారి సంజీవ రెడ్డి, రైతు శిక్షణ కేంద్రం అధికారులు సరళ, శ్రీనివాసులు, కే.వి.కే శాస్త్రవేత్తలు దివ్య, రాము కుమార్, గ్రామ సర్పంచ్ అన్నాదొరై, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

దూసుకొస్తున్న మాండూస్ తుపాన్



ప్రజాశక్తి-చిల్లకూరు: చిల్లకూరు మండలంలోని సముద్ర తీర ప్రాంతాలైన కష్ణపట్నం, తమ్మినపట్నం, తీగపాలెం, లింగవరం, వరగలి తదితర ప్రాంతాల్లో ఎస్సై గోపాల్ తన సిబ్బందితో వెళ్లి అప్రమత్తం చేశారు. తుపాను తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎవరూ వేటకు వెళ్లకూడదని తెలిపారు. తీర ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించారు. ఏమైనా ఇబ్బందులు వస్తే 24 గంటలు అందుబాటులో ఉంటామని.. వెంటనే తెలియజేయాలని కోరారు.

పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలో శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని..చెరువులు, కాలువలు , స్వర్ణముఖి నది మొదలైన ప్రాంతాలలో చేపల వేటకు వెళ్లరాదని తహసీల్దారు జై జై రావు, ఎస్సై మనోజ్ కుమార్ హెచ్చరించారు. చెరువులు గండ్లు పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. పుల్లూరు, కలవకూరు మధ్యలో ఉన్న కల్వర్టుకు ఇరువైపులా దారిని మూసివేస్తూ చుట్టుపక్కల గ్రామ ప్రజలు వేరే దారిలో వెళ్లాలని సూచించారు. జోరువానలో ప్రాణాన్ని లెక్కచేయకుండా విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి



ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపా ధ్యక్షులు తీగల చంద్రశేఖర్ మండలాల్లో పర్యటించే సమయంలో ఏరూరు పంచాయతీ అల్లిపురం గ్రామం, మోమిడి పంచాయతీలోని పునుగుంట పాలెం గ్రామాల్లో మెజార్టీ ప్రజలు హిందువుల అయినప్పటికీ ఒక్క దేవాలయం కూడా లేదని గ్రామస్తులు తెలియజేశారు. వాకాడు పూడి కుప్పంలో గ్రామస్తులే చందాలు పోగుచేసి ఆలయాన్ని కొంత మేరకు నిర్మాణాన్ని చేసినా ఆలయం అసంపూర్ణంగా ఉందని ఆలయ నిర్మాణం కోసం హిందూ ధర్మ సంస్థతో మాట్లాడి సహాయం చేయాలని గ్రామస్తులు కోరారు. వెంటనే ఈ విషయాన్ని హిందూ ధర్మం కోసం పని పనిచేసే సమరసతా సేవ ఫౌండేషన్ కార్యనిర్వహకులు డాక్టర్ కోటా సునీల్ కుమార్ గూడూరును కలిసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని జనసేన నాయకులు ప్రజల తరుపున విన్నవించారు. అయన వెంట మోహన్, వెంకటేష్, క్రాంతి తదితరులున్నారు.